క్లుప్తంగా

పలు గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ పాదయాత్ర

కపిలేశ్వరపురం: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) నాయకులు చేపట్టిన పాదయాత్ర మూడో రోజైన ఆదివారం మండలంలోని తాతపూడి గ్రామంలో ప్రారంభమైంది. పడమర ఖండ్రిక, అంగర, నల్లూరు మీదుగా వెదురుమూడి వరకూ సాగింది. సంఘం నాయకులు ధూళి జయరాజు మాట్లాడుతూ రాజ్యాంగ స్వభావాన్ని పాలకులు నిర్వీర్యం చేయడాన్ని ఖండించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మాదిగ సామాజిక వర్గీయులు పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతపై అవగాహన



ద్రాక్షారామలో చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రామచంద్రపురం రూరల్: అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం మండలంలోని గ్రామ సచివాలయాల వద్ద ఆయా సర్పంచ్‌ల ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది నేతృత్వంలో చేతుల పరిశుభ్రత ఆవశ్యకత, చేతులు శుభ్రం చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శులు చేతులు పరిశుభ్రంగా ఉంచుకుంటామని, ఆరోగ్యాన్ని కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఆయా పంచాయతీల వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు, చిన్నారులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎంప్లాయీస్ రాష్ట్ర యూనియన్ నేతగా ఆశిష్



ఆశిష్‌కుమార్‌ను అభినందిస్తున్న యూనియన్ నాయకులు

మండపేట: ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యవర్గ సభ్యుడిగా మండపేట మున్సిపాలిటీకి చెందిన సీనియర్ అసిస్టెంట్ ఆశిష్‌కుమార్ ఎన్నికయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర యూనియన్ ఎన్నికల్లో ఈ మేరకు సభ్యులు తనను బలపరిచినట్టు ఆశిష్ స్థానిక మీడియాకు తెలిపారు. ప్రస్తుతం ఆశిష్‌కుమార్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. రాష్ట్ర నాయకునిగా ఎన్నికైన ఆయనను మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, కమిషనర్ టి.రామ్‌కుమార్, డీఈ శ్రీనివాస్, మున్సిపల్ ఉద్యోగులు అభినందించారు.

కాపవరంలో పాక దగ్ధం: మహిళకు గాయాలు



కాపవరంలో దగ్ధమైన తాటాకు పాక

రామచంద్రపురం రూరల్: మండలంలోని కాపవరంలో ఆదివారం సాయంత్రం టేకుమూడి కామరాజు– నాగమణి దంపతులు నివాసం ఉంటున్న తాటాకు పాకలో అగ్నిప్రమాదం సంభవించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నాగమణి టీ పెడదామని పొయ్యి దగ్గరకి వెళ్లేటప్పటికే పై నుంచి మంటలు వ్యాపించాయి. ఆ మంటల్లో నాగమణి గాయాల పాలయింది. ఇంటిలో ఉండే సామానులు కట్టుకున్న బట్టలతో సహా కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం ఉంటుందని అంటున్నారు. గ్రామ ఎంపీటీసీ రెడ్నం సతీష్, వీఆర్‌ఓ ఎస్.శ్రావణి బాధితులను ఓదార్చారు. మంత్రి వేణు దృష్టికి తీసుకువెళ్లి తగిన విధంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

నిత్యాన్నదానానికి రూ.25,002 విరాళం



దాత రామారావుకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సూపరింటెండెంట్

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఉప్పలగుప్తం మండలం ఎన్.కొత్తపల్లికి చెందిన వుయ్యూరి రామారావు రూ.25,002 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరాజుకు అందజేశారు. దాతను ఆలయ అర్చకులు వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.



మండపేటలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భవానీ మాలధారులు



అంగర శ్రీమధ్యాహ్నపు అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



రాయవరం మండలం సోమేశ్వరంలో భవానీ భక్తుల పూజలు

కొలువుదీరిన దుర్గామాత

- ఘనంగా నవరాత్ర ఉత్సవాలు ప్రారంభం
- పెద్ద ఎత్తున భవానీ మాలలు



దుర్గాదేవి అలంకారంలో ద్రాక్షారామ కన్యకా పరమేశ్వరి అమ్మవారు



భీమేశ్వరాలయ ప్రాంగణంలో భక్తులకు ప్రసాద వితరణ చేస్తున్న దాతలు సుబ్బారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, సత్తిరెడ్డి



రామచంద్రపురం కొత్తూరులో బాలత్రిపుర సుందరి దేవి అమ్మవారి రూపంలో కనకదుర్గమ్మ వారు

రామచంద్రపురం: నియోజకవర్గంలో దేవి శరన్నవరాత్ర మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. కొత్తూరు రోడ్డు జోడు తూముల వద్ద వేంచేసిన కనకదుర్గ అమ్మవారి దేవి శరన్నవ రాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అమ్మవారు బాలత్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులు దర్శించుకున్నారు. ఉదయం అమ్మవారి ప్రత్యేక దర్శనం అనంతరం అమ్మవారికి 11 రకాల ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ముచిమిల్లి కాలువ వద్ద నుంచి అమ్మవారి ఆయుధాలు ఖడ్గం, త్రిశూలం, మహా కలశం, పోతురాజు స్వామి వారి పూజలు ముగించుకుని ఊరేగింపుగా ఆలయానికి వచ్చి గోదావరి జలంతో కలశస్థాపన గావించారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారి ఆలయం వద్ద రోజు ఏఏ రోజులు కుంకుమ పూజలు జరుగుతాయని ఆలయ బ్రహ్మ బ్రహ్మశ్రీ చెరుకుపల్లి గణేష్‌శర్మ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శివాలయం వీధిలోని దుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద దేవీ నవరాత్ర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద భారీ సెట్టింగులతో విద్యుత్ దీపాలంకరణ చేశారు. తొలి రోజున అమ్మవారు బాలత్రిపుర సుందరీ దేవి అమ్మవారిగా దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. శీలంవారిసావరం రోడ్డులోని అమ్మవారి ఆలయం, శాంతినగర్‌లోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద దేవీ నవరాత్ర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మహిళలు అధికసంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు చేశారు.

రామచంద్రపురం మండలంలో..

రామచంద్రపురం రూరల్: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు దేవాలయాల్లో శరన్నవరాత్ర మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. దక్షిణ కాశీ ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో 12వ శక్తిపీఠం మాణిక్యాంబా అమ్మవారి సన్నిధిలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, వరలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ఉత్సవాలను ప్రారంభించారు. ద్రాక్షారామ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వారణాసి కార్తికేయ బ్రహ్మత్వంలో దసరా మహోత్సవాలను ప్రారంభించారు. మొదటి రోజు దుర్గాదేవి అమ్మవారి అవతారంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు అలరించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పసుమర్తి శ్రీరామకకృష్ణ, ఉపాధ్యక్షుడు బచ్చు వీరభద్రలక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి అప్పన రాజశేఖర్, కోశాధికారి వెచ్చా కిషోర్, కార్యదర్శులు పసుమర్తి సూర్యశేఖర్, సమయమంతుల సత్యానందంలు పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆదివారపుపేట శివబాలయోగి మహారాజ్ ఆశ్రమంలో పార్వతి అమ్మవారు మొదటి రోజు బాలత్రిపుర సుందరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకుడు బోండు బాల బ్రహ్మత్వంలో పూజలు నిర్వహించారు. వెల్ల సోమేశ్వర స్వామి, వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో శ్రీచక్ర నవార్చన, కలశస్థాపన నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వీరబోయిన సూరిబాబు దంపతులు నూతన వస్త్రాలు సమర్పించారు. ఆలయ ఈఓ ఎంవీవీ సత్యానారాయణ, మాజీ సర్పంచ్ వట్టికూటి ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్ర పర్వదినాల్లో దాత ప్రసాద వితరణ

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో శరన్నవ రాత్ర పర్వదినాల్లో ఆలయానికి విచ్చేసే భక్తులకు తోటపేట వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ అధినేత, ప్రముఖ దాత సత్తి సుబ్బారెడ్డి ప్రత్యేక కౌంటర్ ద్వారా ప్రసాద వితరణ చేపట్టారు. 11 రోజుల పాటు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఆలయానికి విచ్చేసే వేలాది మంది భక్తులకు ప్రసాదం అందించేలా దాత సుబ్బారెడ్డి కుమారులు సత్తి సూర్యనారాయణరెడ్డి, సత్తి సత్తిరెడ్డిలు ఏర్పాట్లు చేశారు.

మండపేట: కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారు తల్లి దుర్గామాత నవరాత్ర ఉత్సవాలు ఆదివారం ఘనంగా మొదలయ్యాయి. ఆలయాలు, ప్రత్యేక మండపాల్లో ఎక్కడ చూసినా ప్రత్యేక పూజలు, భవానీ మాలధారులతో పండుగ వాతావరణం కనిపిస్తోంది. దేవీ నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం వందలాది భక్తులు భవానీమాలలు ధరించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాలు, ఆలయాల్లో ఉత్సవ కమిటీలు అమ్మవారిని ప్రతిష్ఠించి అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు ప్రారంభించారు. ఏడిద రోడ్డులోని పెద్దమ్మ తల్లి ఆలయం, పట్టణంలోని కొండపల్లి వారి వీధిలోని అమ్మవారి ఆలయం, కలువపువ్వు సెంటర్, సత్యశ్రీ రోడ్డులోని దుర్గాదేవి ఆలయం, రైతు బజారు వద్ద గల అమ్మవారి ఆలయం, అయ్యప్ప స్వామివారి ఆలయంలోని మాళిగ పురుత్తమ్మ గుడి భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని ద్వారపూడి అయ్యప్ప స్వామివారి ఆలయం, కేశవరం, ఏడిద, ఏడిద సీతానగరం, వెలగతోడు, పాలతోడు, అర్తమూరు, తాపేశ్వరం తదితర గ్రామాలు నవరాత్రి ఉత్సవాల శోభను సంతరించుకున్నాయి. ఆయా గ్రామాల్లో అమ్మవారి ఆలయాలను విద్యుత్ దీపాలంకరణలతో శోభాయమానంగా అలంకరించారు.

మాలధారణ

నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు భవానీ మాలధారణ చేశారు. స్థానిక అయ్యప్పస్వామి వారి ఆలయంతో పాటు పట్టణంలోని ఆయా ఆలయాల వద్ద భక్తులచే ఆలయాల అర్చకులు మాలధారణ చేయించారు. పట్టణంలో దాదాపు రెండు వేల మందికి పైబడి భవాని మాలలు ధరించడం గమనార్హం. భవానీ మాలలు వేసే వారితో ఉదయం, సాయంత్రం ఆయా ఆలయాలు కిటకిటలాడాయి.

కపిలేశ్వరపురం: మండలంలోని గ్రామాల్లో ఆదివారం శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. తాతపూడి, కపిలేశ్వరపురం, అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి వల్లూరు, నేలటూరు, నిడసనమెట్ట, వడ్లమూరు, అత్యుతాపురం, నల్లూరు గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు. ఆలయాల్లో పూజలు చేశారు. అమ్మవారిని విశేషంగా అలంకరించారు.

రాయవరం మండలంలో..

రాయవరం: మండలంలోని రాయవరం, వి.సావరం, వెదురుపాక, లొల్ల, నదురుబాద, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, మాచవరం, చెల్లూరు, వెంటూరు, కురకాళ్లపల్లి, కూర్మాపురం గ్రామాల్లో శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పలుచోట్ల భక్తులు ఉత్సవ కమిటీలుగా ఏర్పడి చలువ పందిళ్లు వేసి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠలను ఘనంగా నిర్వహించారు. భక్తుల భవానీ నామస్మరణ, మంగళ వాయిద్యాలు, బాణసంచాతో విగ్రహ ప్రతిష్ఠకు ముందుగా అమ్మవారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వేకువజాము నుంచి పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పాడి పంటలను, పిల్లా పాపలను చల్లగా చూడాలని కోరుతూ వారు అమ్మవారికి మొక్కుకున్నారు.

అభివృద్ధి చూసి ఓర్వలేకే దుష్ప్రచారం



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా నేత దేవి

మండపేట: ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నేతృత్వంలో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు దుష్ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మహిళా నేత ఓగిరాల దేవి అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్సీ తోట కృషి చేస్తుంటే శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారంటూ ప్రజలను రెచ్చగొట్టే ధోరణిలో ఎమ్మెల్యే వేగుళ్ల నేలటూరులో అసత్య ఆరోపణలు చేశారని మండి పడ్డారు. మండపేటను దీర్ఘకాలంగా వేధిస్తున్న సమస్యలకు ఎమ్మెల్సీ తోట చరమగీతం పాడుతుండడం చూసి ఎమ్మెల్యే వేగుళ్లకు ఓటమి భయం పట్టుకుందన్నారు. టీడీపీ నేత అచ్చెన్నాయుడుపై అక్రమ కేసులు పెట్టారని ఎమ్మెల్యే వేగుళ్ల వాపోతున్నారని, టీడీపీ హయాంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడుపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేసిన విషయం మీకు గుర్తు లేదా? అని దేవి ప్రశ్నించారు. ప్రజలకు వాస్తవాలు తెలుసునని, వచ్చే ఎన్నికల్లో మండపేటలో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని దేవి పేర్కొన్నారు.

అసత్య ప్రచారం చేస్తే సహించేది లేదు

- పారదర్శకంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం
- అభివృద్ధి చూసి ఓర్వలేకపోతున్నారు
- ద్వారపూడి పంచాయతీ పాలకవర్గం ఆవేదన



మీడియాతో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

మండపేట: ద్వారపూడి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధిపై అసత్య ప్రచారం చేస్తే సహించబోమని పంచాయతీ పాలకవర్గం, వైఎస్సార్ సీపీ నేతలు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో మునుపెన్నడూ లేని విధంగా గ్రామంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఎల్లో మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఆదివారం ద్వారపూడి పంచాయతీ వద్ద సర్పంచ్ ఈతకోట కిన్నెర, ఉప సర్పంచ్ తులా శేషారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దంతులూరి శ్రీరామవర్మ తదితరులు మీడియాతో మాట్లాడారు. గ్రామంలోని పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంలో అక్రమాలు జరిగాయని, వ్యాపారుల నుంచి వసూలు చేసిన రూ.45 లక్షలు గుడ్ విల్ నిధులు పంచాయతీకి చెందిన ఒక నేత కాజేశారని ఎల్లో మీడియాలో అసత్య ప్రచారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ తీర్మానం, బైలాకు లోబడి అధికారుల అనుమతితో పారదర్శకంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం జరుగుతోందన్నారు. కాంప్లెక్స్‌ను ఆనుకుని ప్రయాణికుల కోసం విశాలమైన బస్‌షెల్టర్ నిర్మించామన్నారు. మొత్తం 30 షాపుల నుంచి రూ.1.5 లక్షల చొప్పున పంచాయతీకి గుడ్‌విల్ రూపంలో రూ. 45 లక్షలు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.11.29 లక్షలు మాత్రమే వచ్చిందన్నారు. ఈ మొత్తానికి పంచాయతీ నుంచి రశీదులు ఇచ్చారన్నారు. మిగిలిన రూ. 33.71 లక్షలు మొత్తం షాపులకు సంబంధించిన వ్యాపారుల నుంచి రావాల్సి ఉందన్నారు. పూర్తి డిపాజిట్ చెల్లించిన వారికే షాపు తాళాలు అప్పగించాలని పంచాయతీ నిర్ణయించిందని వారు తెలిపారు. ఇందులో అవినీతి ఎక్కడ ఉందని, ఏ నేత కాజేశారో చెప్పాలన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నేతృత్వంలో గ్రామంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాని, గ్రామంలో ఎన్నో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం లభిస్తోందన్నారు. అసత్య ప్రచారం చేసే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. సొసైటీ పర్సన్ డి.సూర్యనారాయణమూర్తి, పార్టీ నాయకులు పోలినాటి సత్యనారాయణ, తొంటాపు సత్తిపండు, గూడూరి సుబ్బరాజు, నాగేశ్వరరావు, వ్యాపారులు పాల్గొన్నారు.

పరిశీలన పెరిగేందుకు ప్రయోగాలు అవసరం

రామచంద్రపురం: విద్యార్థులు శాస్త్ర పరిశీలన పెంచుకునేందుకు, శాస్త్రవేత్తలుగా తయారు కావడానికి ప్రయోగాలు ఎంతో అవసరమని దీని కోసం ప్రయోగపూర్వక వర్క్‌షాపులను సద్వినియోగం చేసుకోవాలని రామచంద్రపురం పట్టణ ఎస్సై డి.సురేష్‌బాబు సూచించారు. స్థానియ లయన్స్ కల్యాణ మండపంలో లయన్స్ క్లబ్, రేవతి సైన్స్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన 'విద్యార్థుల ప్రయోగపూర్వక వర్క్ షాప్‌'ను ఎస్సై డి.సురేష్ బాబు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రయోగాల వర్క్‌షాపుల ద్వారా మంచి పరిజ్ఞానం లభిస్తుందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రేవతి సైన్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు కృష్ణ సాయి మాట్లాడుతూ ప్రయోగాలతో కూడిన విజ్ఞాన శాస్త్రం విద్యార్థులకు ఎంతో అవసరం అన్నారు. లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ వంశీ మోహన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి ఉపయోగపడే ఎటువంటి కార్యక్రమానికైనా తాము ముందు ఉంటామని తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి సుమారు వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మోడరన్ విద్యాసంస్థల అధినేత జీవీ రావు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పూర్వపు సైన్స్ జిల్లా అధికారి జి.వసంత కుమార్, రామానుజన్ మ్యాథ్స్ అకాడమీ అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, రేవతి సైన్స్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బుద్ధా శ్రీనివాస్, లయన్స్ క్లబ్ సెక్రటరీ వీరబాబు, జి.చిట్టిబాబు, జి.రామకృష్ణ ఎస్ఎస్ఎస్ ప్రకాష్, రవికుమార్, మితేష్, జి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మంత్రి చెల్లుబోయిన వేణు



యండగండిలో లబ్ధి చేకూరిన వివరాలతో కూడిన పత్రాలను అందిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు

కె.గంగవరం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందరిస్తూ వారిని ఆర్థికంగా ఆదుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని యండగండిలో రెండో రోజు ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రతి ఇంటికీ వెళ్లి ఆ కుటుంబానికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను గురించి వివరించి పత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రతి ఇంటికీ సంక్షేమం అందించాలనే ఉద్దేశంతో నవరత్న పథకాలు ప్రవేశపెట్టిందని దానిలో భాగంగానే అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా మధ్యవర్తిత్వం లేకుండా అందిస్తుందన్నారు. ప్రభుత్వం పేదలకు మంచి చేయాలని ఉద్దేశంతో పని చేస్తుంటే ప్రతిపక్ష పార్టీలు ఓర్వలేక అర్థం లేని వాదనలు చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరు రానున్న కాలంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా మళ్లీ సీఎంగా జగన్ పాలనే కొనసాగుతుందన్నారు. రానున్న కాలంలో కూడా ఇప్పుడు అందిస్తున్న సంక్షేమ పథకాలను అమలు చేసి పేద ప్రజలను ఆదుకుంటామని చెప్పారు. ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజలకు మేలు చేస్తామని చెప్పారు. ఎంపీపీ పంపన నాగమణి, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, సర్పంచ్ చోడే గోవిందరాజు(దత్తుడు), గ్రామ కన్వీనర్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు సాదే నారాయణరావు, బీసీ నాయకులు పంపన సుబ్బారావు, మాజీ మండల కన్వీనర్ ఓబులనేని రాజ్‌కుమార్, ఎంపీటీసీలు దుర్గాప్రసాద్, రెడ్డి జయరాజు, పలు గ్రామాల ఎంపీటీసీ, సర్పంచ్‌లు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కుక్కలున్నాయ్.. పిక్కలు జాగ్రత్త

- హడలెత్తిస్తున్న కుక్కలు
- వృద్ధులు, చిన్నారులపై దాడులు
- పట్టించుకోని అధికారులు



కె.గంగవరం మండలం పామర్రులో రోడ్డుపై గుంపుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

కె.గంగవరం: సాయంత్రమైతే చాలు కుటుంబంతో రోడ్డెక్కుతాయి. కూడళ్లలో విశ్రాంతి తీసుకుంటాయి. కనిపిస్తే కండ పీకి పరుగులు పెట్టిస్తాయి. పట్టణాల నుంచి గ్రామీణ ప్రాంత పల్లెల వరకు శునకాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. శస్త్ర చికిత్సలతో శునకాల సంతతి తగ్గించాలని ప్రభుత్వం ఆదేశించింది. పట్టణంలోని మున్సిపాలిటితో పాటు గ్రామ పంచాయతీల వరకు నిధులు ఉన్నా శుణకాల నియంత్రణ కాగితాలకే పరిమితమైంది. రామచంద్రపురం పట్టణంతో పాటు కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం రూరల్, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లోని గ్రామాల్లో కుక్కల బీభత్సం సృష్టిస్తున్నాయి. రోజున సగటు ఒకరిద్దరు కుక్కకాటుకు గురవుతున్నారు. వాహన చోదకులు కుక్కల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలవుతున్న సంఘటనలు కనిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్న శునకాల నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించడంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కె.గంగవరం మండలంలో 2000, కాజులూరు మండలంలో 2300, రామచంద్రపురం రూరల్ 1800, మండపేట నియోజకవర్గంలో సుమారుగా 6740 వరకు కుక్కలు ఉన్నట్లు అంచనా. గ్రామాల్లోని మాంసం విక్రయ కేంద్రాల వద్ద వ్యర్థాలు తింటూ మనుషులు, పశువులపై దాడులు చేస్తున్నాయని స్థానికులు అంటున్నారు.

ప్రథమ చికిత్స ఇలా..

కుక్కకాటుకు గురైతే గాయాన్ని సబ్బుతో, నీటితో బాగా కడగాలి. గాయాల్ని కప్పకూడదు. దగ్గర్లోని డాక్టర్‌ని సంప్రదించాలి. రేబిస్‌తో చనిపోయిన జంతువులను కాల్చడం లేదా సున్నపు గుంటలో పూడ్చడం చేయాలి. కుక్క ఉండే పరిసరాలు, అవి తిరిగే ప్రదేశాలు, పాత్రలను క్రిమిసంహారక మందులతో తరుచూ శుభ్రపరుచుకోవాలి. ఈ వ్యాధికి చికిత్స లేదు. పెంపుడు కుక్కలను పశువైద్యుడితో రేబిస్ టీకా వేయించాలి. ఊరకుక్కలకు కూడా ఈ వ్యాధి రాకుండా పంచాయతీల సహాయంతో టీకాలు వేయించాలి.

రేబిస్ కుక్కల లక్షణాలివి..

రేబిస్ లక్షణాలున్న కుక్కల నోటి నుంచి చొంగ కారుతుంది. నాలుక బయటపెట్టి మతిలేకుండా తిరుగుతాయి. కనిపించిన వారిని, పశువులను, ఇతర కుక్కలను కరుస్తాయి. అరుపులో మార్పు వస్తుంది. ఇవి 7 నుంచి 10 రోజుల్లో చనిపోతాయి. ఈ జబ్బు వచ్చిన మరికొన్ని కుక్కలు తినకపోవడం, నిశ్చలంగా ఒకచోటే పడుకుని అలాగే ఉండిపోతాయి. పక్షవాతం రావడం తదితర లక్షణాలతో రెండు మూడు రోజుల్లో చనిపోతాయి. దీన్ని మూగ రేబిస్ అంటారు. రేబిస్ కుక్క కరిస్తే వ్యాధి నిరోధక టీకాలు వేయించడం తప్పనిసరి.

ప్రత్యేక నిధులు లేవు



కుక్కలను పట్టేందుకు పంచాయతీలకు ప్రత్యేక నిధులు లేవు. వాటిని సంహరించే అధికారం లేదు. పిచ్చికుక్కలను గ్రామస్తులే సంహరిస్తున్నారు. కుక్కలు ఎక్కువగా మాంసం విక్రయ కేంద్రాల వద్దే సంచరిస్తున్నాయి. మాసం వ్యర్థాలను ఊరికి దూరంగా పాడేయాలని వారికి సూచించాం. వీధి కుక్కలకు కుటుంబ నియంత్ర శస్త్ర చికిత్సలో కోసం పశువైద్యులను సంప్రదించాం. త్వరంలో గ్రామ సర్పంచ్‌ల సహకారంతో వాటిని చికిత్స చేస్తాం.

– ఎస్.శ్రీనివాసరావు, ఎంపీడీఓ, కె.గంగవరం

దినదిన గండంగా ఉంది



గుంపులు గుంపులుగా కుక్కలు వీధుల్లో స్వైర విహారం చేస్తూ భయ భ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఎప్పుడు ఏ వైపు నుంచి వచ్చి ఎవరి మీద దాడి చేస్తాయో తెలియడం లేదు. ఇదివరకే ఎంతో మందిపై దాడి చేసి గాయపరిచాయి. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందించడం లేదు.

– దూడల నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ, వత్రపూడి